అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్


విద్యుత్ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన విద్యుత్ ఈఈ ముషారఫ్‌తో సమావేశమయ్యారు. కార్వాన్ నియోజకవర్గంలో వీధి లైట్ల అస్తవ్యస్త నిర్వహణపై ఆయన ఈఈపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో నెలల నుంచి నియోజకవర్గంలో వీధి లైట్ల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని క్షేత్రస్థాయి అధికారులతో పాటు ఉన్నతాధికారులు సైతం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను ఎన్నోసార్లు అధికారులను కలిసినా వారిలో చలనం రాలేదన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఏ ఒక్క వీధి లైటు సరిగ్గా వెలగడం లేదని ఆయన అన్నారు. సంవత్సరాల తరబడి కొన్ని విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా మారాయని ఎన్నోమార్లు తాను ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కొత్తవి ఏర్పాటు చేయలేదని ఆయన అన్నారు. మోడ్రన్ వీధిలైట్ల బల్బులు వందల సంఖ్యలో మాడిపోయాయని వాటిని నెలల తరబడిగా మార్చకుండా వదిలేశారని ఆయన పేర్కొన్నారు. అధికారులు మారుతున్నా అధికారుల పనితీరు మాత్రం మారలేదని ఆయన స్పష్టం చేశారు. అధికారుల తీరు మారకుంటే తాను మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులతో అధికారుల కార్యాలయాల ముందు ధర్నా చేస్తానని ఆయన స్పష్టం చేశారు. వానాకాలం వచ్చిందని ఇకనైనా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఓ వైపు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉన్నా విద్యుత్ తీగలను సరి చేయాలని ఆయన అన్నారు. ప్రజాధనంతో వీధి లైట్ల నిర్వహణ జరుగుతుందని అధికారులు మాత్రం తామేదో ప్రజలకు సేవ చేస్తున్నామని ఫోజులు పెడుతున్నారని ఆయన విమర్శించారు. అధికారులను వెంటనే రంగంలోకి దింపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విద్యుత్ ఈఈ ముషారఫ్‌ను కోరారు.

15లోగా అభివృద్ధి పనుల వివరాలు అందజేయాలి


జోనల్ కమిషనర్ వెంకన్నను సన్మానిస్తున్న గాజుల అంజయ్య, రాకేష్ తివారి

చార్మినార్: ఈనెల 15వ తేదీ వరకు ఆయా ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను తనకు అందజేస్తే వెంటనే ఎస్టిమేషన్ వేయించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న హామీ ఇచ్చారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారి తదితరులు మంగళవారం ఆయనను కలిసి బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు ముందే అవసరమైన మేరకు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరుతూ వారు మర్యాదపూర్వకంగా జోనల్ కమిషనర్‌ను కలిసి బోనాల జాతర ఉత్సవాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు–2024 కోసం అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పాతబస్తీలోని ఏయే ఆలయాల వద్ద ఎలాంటి పనులు చేపట్టాలనే విషయాలను పేర్కొంటూ మూడు రోజుల్లో తనకు వివరాలు అందజేయాలన్నారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సిఫారస్సుల మేరకు ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించిన వెంటనే అభివృద్ధి పనులు చేపట్టి సాధ్యమైనంత వెంటనే పూర్తి చేసేటట్లు మానిటరింగ్ చేస్తామన్నారు. దీనికి ఉమ్మడి కమిటీ నూతన చైర్మన్ గాజుల అంజయ్య అంగీకరించి తప్పని సరిగా ఈ నెల 15వ తేదీ వరకు వివరాలు అందజేస్తామన్నారు.

గోల్కొండలో 'బడిబాట'


బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి తదితరులు

గోల్కొండ: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేరాలని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. మంగళవారం ఆమె గోల్కొండ చోటాబజార్, ఖాజీగల్లి, జామా మజీదు గల్లీ తదితర ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి బడికి రాని పిల్లల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే మరిన్ని మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆమె కోరారు.

వాటర్ బోర్డులో పాత బకాయిలు చెల్లించండి


ఎండీ సుదర్శన్‌రెడ్డిని సత్కరించిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్ బోర్డ్‌లో పాత బకాయిలు చెల్లించాలని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వాటర్‌బోర్డ్ ఎండీ సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సత్కరించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..గతంలో 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వాటర్ బోర్డు చిన్నా చితక కాంట్రాక్టర్లను రోడ్డుపాలు చేసిందన్నారు. కోట్లాది రూపాయలు పాత బకాయిలు ఉండడంతో వేలాది మంది కాంట్రాక్టర్లు జీవనం గడపలేక అప్పుల పాలయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఎండీ సుదర్శన్‌రెడ్డి పేద బీద కాంట్రాక్టర్లను పరిగణలోకి తీసుకొని వారి పెద్ద బకాయలను చెల్లించేందుకు ముందుకు రావాలని ఆయన సూచించారు.

ఎండ, వానకు షెల్టర్లుగా ఫ్లై ఓవర్లు


షేక్‌పేట్ ఫ్లై ఓవర్ కింది భాగంలో వర్షానికి తలదాచుకున్న వాహనాదారులు

గోల్కొండ: ఫ్లై ఓవర్లు వాహనాదారులకు రక్షణగా మారాయి. మెహిదీపట్నం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, టోలిచౌకి చౌరస్తా ఫ్లై ఓవర్, షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారి ఫ్లై ఓవర్లు వాహనాదారులకే కాకుండా తోపుడు బండ్ల వ్యాపారులు, పాదచారులకు ఎండకు, వానకు షెల్టర్లుగా మారుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మెహిదీపట్నం, పాత ముంబాయి జాతీయ రహదారిపై వాహనాదారులు వర్షం మొదలుకాగానే ఫ్లై ఓవర్ కింద వాహనాలు ఆపి షెల్టర్ పొందుతున్నారు. భారీ వర్షం నుంచి ఈ విధంగా వారు ఫ్లై ఓవర్ కింద తలదాచుకుంటున్నారు. రోడ్ల పొడవునా వ్యాపారం చేసే తోపుడు బండ్ల వారు సైతం వర్షం మొదలు కాగానే ఫ్లై ఓవర్ కిందకు తమతమ తోపుడు బండ్లతో చేరుతున్నారు. వేసవి కాలంలో మధ్యాహ్నం సమయంలో మండుటెండ నుంచి వాహనాదారులు కొద్దిసేపు ఫ్లై ఓవర్ కిందకు చేరి సేదతీరుతున్నారు.

మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించండి


మురుగునీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, జలమండలి అధికారులు

గౌలిపురా: మేకలమండిలో ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మేకలమండిలో కొన్ని రోజులుగా పొంగిపొర్లుతున్న మురుగునీటి ప్రవాహాన్ని జలమండలి అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..మేకలమండి ప్రాంతంలో పొంగిపొర్లుతున్న మురుగు నీటితో స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పలు మార్లు జలమండలి ఉన్నతాధికారులు చుట్టూ తిరిగి సమస్యను పరిష్కరించాలని సూచించినా ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. యుద్ధప్రతిపాదికన మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె జలమండలి అలియాబాద్ సెక్షన్ మేనేజర్ ముఖురం బాబాకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు జి.రఘుకాంత్, నాయకులు మల్లేష్, జి.వికాస్, జలమండలి అధికారులు సర్వేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు

- మరమ్మతులకు నోచుకోకుండా అలంకారప్రాయంగా మారిన వైనం
- సాక్షి కథనానికి స్పందించిన జలమండలి
- ఏకకాలంలో అందుబాటులోకి వచ్చిన మూడు బోరింగ్‌లు

సాక్షి ఎఫెక్ట్..


బేలా కాలనీలో..


శాలిబండలో..


రాంభక్షిబండలో..

చార్మినార్: మరమ్మతులకు నోచుకోకుండా శిథిలావస్థకు చేరుకున్న చేతి పంపులకు మోక్షం కలిగింది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న స్థానికులకు నీటి సమస్య తీరనుంది. రాబోయేది పండుగల సీజన్ కావడంతో స్థానికులకు నీటి అవసరం ఎంతగానో ఉంటుంది. కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు మంచినీరు వస్తుండడంతో..రోజు వారి అవసరాలు తీరడం లేదు. దీంతో స్థానికులు చేతి పంపుల నీటిపై ఆధారపడ్డారు. అయితే పాతబస్తీలోని బేలా కాలనీ, శాలిబండ, రాంభక్షిబండ తదితర ప్రాంతాల్లోని చేతి పంపులు పని చేయక మోరాయించాయి. విషయం సాక్షికి తెలియడంతో ఈ నెల 5న 'ఈ చేతి పంపులు.. అలంకార ప్రాయమే' అనే శీర్షికతో సమస్యను సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. ఇక్కడ నీటి అవసరాలు ఎక్కువగా ఉండడంతో చేతి పంపుల అవసరాన్ని ప్రముఖంగా ప్రచురించింది. వెంటనే స్పందించిన జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్‌తో పాటు జనరల్ మేనేజర్ కృష్ణనాయక్ తదితరులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సంబంధిత జలమండలి సెక్షన్ మేనేజర్లను అలెర్ట్ చేసి మరమ్మతులు చేయించారు. దీంతో జలమండలి అధికారులతో పాటు 'సాక్షి'యాజమాన్యానికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా చార్మినార్ సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ ఏడీఈ అక్బర్ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జూ పార్క్ మెయిన్ రోడ్డు, రాంనాస్‌పురా, ప్రిన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే రమా థియేటర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని బహదూర్‌పురా, రమా థియేటర్, కామాటిపురా, ఉస్మాన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ప్రొఫెసర్ కోదండరాంకు పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఈనెల 12న రవీంద్ర భారతిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రొఫెసర్ కోదండరాంకు తెలంగాణ రాష్ట్ర సాధన విప్లవ యోధుడు పురస్కారాన్ని అందజేయనున్నట్లు శృతిలయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆమని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్ గుప్తా ఏసీపీ జితేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని సీల్‌వెల్ సినీ స్వరాలు పేరిట సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

'కోట బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం'

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని శ్రీ జగదాంబిక మహంకాళీ ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. గోల్కొండ కోటలో కొలువుదీరిన అమ్మవారి ఆషాఢ మాసం బోనాల జాతరకు ఏర్పాట్లు గత వారమే ప్రారంభమయ్యాయన్నారు. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ప్రారంభమయ్యే ఈ బోనాల ఉత్సవాలు రాష్ట్రానికే తలమానికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిర్వహణలో జరిగే ఈ బోనాల ఏర్పాట్లకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోట పైన గల ఆలయం వద్ద పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. జులై 7వ తేదీ నుంచి ఆషాఢ బోనాలు ప్రారంభమవుతాయని మొత్తం 9 పూజలు అమ్మవారికి నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి


కృష్ణ

అబిడ్స్: జీహెచ్ఎంసీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని జీహెచ్ఎంఓఈయూ అధ్యక్షుడు వై.కృష్ణ పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉండి వారి దీర్ఘకాలిక సమస్యలు ప్రభుత్వంచే పరిష్కరిచేందుకు ముందుంటానన్నారు. జీహెచ్ఎంఓఈయూ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వై.కృష్ణ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఊదర గోపాల్ తనను నూతన అధ్యక్షుడిగా నియమించారన్నారు. అతని నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. జీహెచ్ఎంసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రధాన సమస్యగా ఉందన్నారు. తక్షణమే వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా జీహెచ్ఎంఓఈయూ నూతన ప్రధాన కార్యదర్శిగా జీఎస్.సంజీవను నియమిస్తూ ఊదర గోపాల్ ఆదేశాలు జారీ చేశారు.

మొహర్రంను రాష్ట్ర ఆచారంగా ప్రకటించాలి


మొహర్రం సన్నాక సమావేశంలో పాల్గొన్న అంజుమన్–ఏ–ముతవల్లియన్ ప్రతినిధులు

శాలిబండ: మొహర్రం (పీరుల ఆజాదారి)ని రాష్ట్ర ఆచారంగా ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణలోని ఆషూర్‌ఖానా సంరక్షకుల సంస్థ అంజుమన్–ఏ–ముతవల్లియన్ అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వీ డిమాండ్ చేశారు. మీర్ అబ్బాస్ అలీ మూస్వీ నేతృత్వంలో మంగళవారం బాద్‌షాహీ ఆషూర్‌ఖానాలో ఆషూర్‌ఖానాల సంరక్షకులు సమావేశమయ్యారన్నారు. ఈ సందర్భంగా అబ్బాస్ అలీ మూస్వీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే మొహర్రంను రాష్ట్ర సమ్మేళనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆషూర్‌ఖానాల సహాయ నజరానా గ్రాంట్ల పెంపుదల, మరమ్మతులు, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వైద్యుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి


వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెడికల్ వైద్యులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టనున్న వైద్యుల బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాల నేతల ప్రమేయం, ఒత్తిడి లేకుండా చూడాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ టీచింగ్ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. మంగళవారం వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మంత్రి దామోదర రాజనర్సింహను మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేసింది. త్వరలో నిర్వహించనున్న వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియను పూర్తి స్థాయిలో పారదర్శకంగా చేపట్టేలా చూడాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, ప్రతినిధులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాబురావు, డాక్టర్ జగతి లు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. గత ప్రభుత్వంలా కాకుండా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యుల బదిలీలు సజావుగా, పారదర్శకంగా జరిగేలా చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వైద్యులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు డాక్టర్ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆజామ్, డాక్టర్ కవిత, డాక్టర్ అరుణ, డాక్టర్ శకుంతల, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ బెంజిమన్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాష్ట్రంలో ఎన్నికలకోడ్ ముగియడంతో 6 గ్యారంటీల్లోని గృహజ్యోతి పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ రంగారెడ్డిజిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తామని చెప్పారన్నారు. ఈ పథకం ద్వారా వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో కింద బిల్లులు అమలు చేయాలని, రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రేటర్ పరిధిలో వచ్చే అన్ని డివిజన్‌లలో కూడా అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేలు, మహిళలకు రూ.2,500లు, గ్యాస్ సిలిండర్ రూ.500లకు హామీలు ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్‌గౌడ్, సత్యం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే అనర్థాలు


ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ పి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, ఫ్రీ లెఫ్ట్ తదితర విషయాల్లో ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కోరారు. మనం చేసే ప్రమాదాల వల్ల అవతలి వారు ప్రాణాలు కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ కూడా పాల్గొన్నారు.

హరినాథ్ గౌడ్‌కు మహానంది అవార్డు


మహానంది అవార్డు అందుకుంటున్న గడ్డమీది హరినాథ్ గౌడ్

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అధిక పెళ్లిళ్లు చేయించిన గౌడ మ్యారేజి బ్యూరో వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డమీది హరినాథ్ గౌడ్‌కు తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహానంది అవార్డును అందజేసింది. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ చేతుల మీదుగా పాతబస్తీకి చెందిన గడ్డమీది హరినాథ్ గౌడ్ ఈ అవార్డును అందుకున్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు


పీస్ ఫోర్స్ కమిటీ చైర్మన్‌తో ఇస్మాయిల్

గోల్కొండ: సమాజ సేవతోనేగుర్తింపు వస్తుందని పీస్ ఫోర్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీలోని పీస్ ఫోర్స్ కార్యాలయంలో మహ్మద్ ఇస్మాయిల్‌కు పీస్ ఫోర్స్ కమిటీలో సభ్యత్వ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కుటుంబం కోసం వివిధ రకాల పనులు, వృత్తులు చేసుకుంటారన్నారు. అయితే సమాజంలో ఎన్నో కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని పేర్కొన్నారు. వారి పిల్లలు చదువుకోలేపోతున్నారన్నారు. అటువంటి కుటుంబాలకు అండగా ఉండి వారి పిల్లలు చదువుకునేలా ఆదుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పీస్ ఫోర్స్ సొసైటీ శాంతిని కోరుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు.

అభినందనలు


డాక్టర్ సాయిసుధను అభినందిస్తున్న డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులో సీనియర్ రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిసుధ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని జైపీ ఆస్పత్రిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొని మెదటి బహుమతి, వైవాలో 3వ బహుమతి సాధించడం అభినందనీమని సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమెను ఆస్పత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ అనురాధలతో కలిసి అభినందించారు.

విద్యాదాత పురస్కార ప్రదానం


రవీందర్‌రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న జయప్రకాష్ నారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అనాథ పిల్లలు, నిరుపేద ప్రతిభ కలిగిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న యశోద ఫౌండేషన్ యశోద హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపకులు గోరుకంటి రవీందర్‌రావుకు విద్యాదాత పురస్కారాన్ని అందజేశారు. వందేమాతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని సమాజానికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని రవీందర్‌రావు తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు


జీవితఖైదు పడిన నిందితులు

బహదూర్‌పురా: హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రమ్నాస్‌పురాకు చెందిన షేక్ ఖాలిద్ (40), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ అన్వర్ అలియాస్ అన్ను (35), మహ్మద్ మునావర్ అలియాస్ బబ్బు (30) వీరు ముగ్గురు కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, పాత కక్షల నేపథ్యంలో వీరు ముగ్గురు జనవరి 2017లో అదే ప్రాంతానికి చెందిన మన్సూర్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. కేసు నమోదు చేసిన బహదూర్‌పురా పోలీసులు విచారణ చేపట్టి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి బి.సురేష్ నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.25,500 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిచారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శైలజ వ్యవహరించి వాదనలు వినిపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అలకాపూర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ 9వ వార్డు పరిధిలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, ఏఈ సాయి మౌనికతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ యోగా సర్కిల్ రోడ్డు పొడగింపు, నేతాజీ పార్కులో మూత్రశాలల నిర్మాణం, కూడలిల బ్యూటిఫికేషన్, ఇంకుడు గుంతల నిర్మాణం, వీధిదీపాలు, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వాటిని త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.